
# కేర్...కేర్...?!



యం.ఆర్.అరుణకుమారి

కేర్...కేర్...కేర్...!

అమ్మా!...అమ్మా! ఎక్కడమ్మా నువ్వు?

ఊపిరిపోసే తొలి ఉచ్ఛ్వాస కేరింతలోనే 'అమ్మా' అన్న పిలుపును పోల్చుకుని పులకరించే తొలి మాతృత్వ మధురిమ 'ఇదిగో...నీ కోసం నేనున్నా! ఏం భయంలేదు. నా బంగరు తల్లీ!' అన్న అభయాన్ని భద్రతా భావాన్ని కల్గిస్తున్నట్లుగా ...ఆప్యాయంగా, జాగ్రత్తగా, పొదువుకొనే నీ అమృత హస్తాల స్పర్శ ఏదీ?

మృత్యువనే కత్తిమీద సాములాంటి ప్రసవవేదనలో పడ్డ కష్టాన్నంతా క్షణాల్లో మరచిపోయి...ఆనందంగా...ఆత్మీయంగా...తడారిపోయిన నా పెదవులు తడిపే కేర్...! కేర్ర్...ర్!

అమ్మా! అమ్మా! పుట్టీపుట్టగానే...నీ పేగు బంధం నుండి తెగిపడిన మరుక్షణమే...మన సంబంధ బాంధవ్యాన్ని తెంచేసిందెవరమ్మా? ఆడపిల్లగా పుట్టిన నా పాపమా? అహంకారానికి ఆలివైన నీ శాపమా? ఏ ఆధిపత్యానికో కూతురువైన నేరమా? లేకపోతే ఏ దొంగతనానికో బలిపెట్టిన నీ శీలమా? చెప్పమ్మా... చెప్పు! ఏది మనిద్దరిని విడదీసింది? ఎందుకు... ఎలా...విడదీయగల్గిందీ?!

అమ్మా! అప్పుడే పుట్టిన బిడ్డను కొద్దిసేపు స్పర్శించాక, కళ్ళకు గంతలు కట్టినా తమ బిడ్డల్ని గుర్తుపట్టగలిగే ఆ అనురాగపూరితమైన 'అమ్మస్పర్శ' అనుభవించకుండానే...కళ్ళు తెరచి నిన్ను చూడకముందే... ఏకంగా కాటికే సాగనంపిన నా పుట్టుక అంత హేయమైందా?

అమ్మా! 'కామా తురాణాం నభయం, నలజ్జ' అన్నట్లుగా వయసు వ్యామోహంతో చరించావో , ఆపోజిట్ సెక్స్ ఆకర్షణనే ప్రేమనుకొని భ్రమించావో, ప్రేమాభిమానాలు పంచే మనసులేని శరీరం కట్టిన లైసెన్సు బిళ్ళలానే వ్యభిచరించావో...నాకైతే తెలీదుగానీ... కడుపు వస్తుందేమోనన్న అనుమానం, భయం, కనీస జ్ఞానం కూడా నీకు లేదా? పోనీ! నీ కపుడు పండించే సంభ్రమాల, సంతోషపు 'పంటను'కానని నీకు తెలిసినపుడు...కనీసం అప్పుడైనా ...నీ మనసు మండించే ఈ నిప్పు 'నలుసు'ను ఏ మురుగు కాల్వలోనో విదిల్చేయాలన్న విచక్షణ కూడా నీకు లేకపోయిందామ్మా? ఎందుకమ్మా? ఎందుకు..ఎవడి మగతనపు 'ఇగో'ను ఉప్పొంగించటానికి ...నీ గర్భసంచీని ఉబ్బించుకొంటూ...నవమాసాలు వెచ్చని ఉమ్మనీటితో నన్ను ఉయ్యాల లూపావు? ఏ చీకటి మాటు కోరికతోనో నీ నిర్లజ్జ నన్నిలా నిర్ధాక్షిణ్యంగా...నగ్నంగా ...నడివీధిలో పారెయ్యటానికి లజ్జ పడలేదామ్మా?

కేర్...కేర్...!

పుట్టగానే...కనీసం స్నానం కూడా చేయించకుండానే...తొమ్మిది నెలలపాటు ఘనీభవించిన రక్తపు చారికలు కూడా కడగ కుండానే ...బ్రతికుండగానే... మరుభూమికి సాగనంపిన నీ ఘనత చరిత్ర పుటల్లో శిలాక్షరాలవుతాయనుకున్నావామ్మా? నీ నామం చిరస్మరణీయమవుతుందని సంబరపడ్డావా? రామ్మా! రా! ఒక్కసారి ఒక్కసారి ఇక్కడకు రా! నా చుట్టూ దడికట్టిన...కారులోంచి విసిరివేయబడినా...ఆగిపోని నా ఊపిరిని వింతగా...నన్నో చోద్యంలా...చూస్తున్న జనం...కళ్ళు, నోళ్ళూ కురిపిస్తున్న అసహ్యం... ఛీత్కారాలు...విందువుగానీ...రామ్మా!

'ఈ ముండదెంత మొండి ప్రాణమో! అంత దూరాన్నుండీ కార్లో విసిరేసినా...చావలేదే!' అంటున్నా కలగని బాధ..."అయినా ఆ లంజముండకు చేతులెట్లా వొచ్చినాయో...బంగారు బొమ్మలా ఉన్న బిడ్డను... ఇట్లా పారేయించడానికి?" అని నిన్ను నానా కారు కూతలు కూస్తుంటే మాత్రం...రోషమైపొడుచుకు

వస్తోంది.

'మా అమ్మను తిట్టకండి. మా అమ్మకేం తెలిసి ఉండదు. మా అమ్మ అమాయకత్వాన్నో, నిస్సహాయత్వాన్నో...ఆసరాచేసుకొన్న ఏ అవకాశమో...పామై నన్నీ స్థితికి దిగజార్చి ఉంటుంది'-అని ఎలుగెత్తి అరవాలని ఉంది. అరుస్తూనే ఉన్నా ఒక్కరూ విన్పించుకోరేం?

కేర్...కేర్...కేర్!

అమ్మా! పసిబిడ్డల ఏడుపు వినటానికి కేర్...కేర్మనే వున్నా అందిరికీ...అందులో విన్పించే వివిధ భావాలు -ఆకలేస్తే ఒకలా, పక్క తడుపుకొన్నప్పుడు ఒకలా...ఏ నిద్దట్లోనో ఏ పీడకలలో భయపడ్డప్పుడు ఒకలా, సంతోషంగా ఉన్నప్పుడు ఇంకోలా...కేవలం కన్నతల్లికి మాత్రమే అర్థమవుతాయి. ఏ పనీ తనంత తాను చేసుకోలేకే కదా..అలారం మోగించినట్టు ... అమ్మ 'కేర్' అవసరమైందని హెచ్చరిస్తున్నట్లూ - కేర్...కేర్ మనడం? 'కేర్' మనగానే 'కేర్' తీసుకోవాల్సిన నువ్వే నన్ను వదిల్చేసుకొన్నప్పుడు - నా ఈ మౌనవేదనను, కేర్ఘోషనూ విన్పించుకోవాల్సిన అవసరం మాత్రం వీళ్ళకేముందనీ?

అవునమ్మా! అబ్బా! ఏమిటీ ఎండలు? ఎలా భరించేదీ వడగాడ్పులు? ఏ ఆచ్ఛాదనా లేని నా శరీరం మీద ఎండి అట్టలు కట్టిన రక్తపు మరకల్ని చుఱుచుఱుమని కాల్చేస్తుందీ ప్రచండ మార్తాండ వేడిమి సెగల బుగలు!

ఇళ్లల్లోనే ఉన్నా ...భరించలేని వేసవితాపం... ఎన్నో ప్రాణాలకు యమపాశాలవుతున్నా...నిద్ర లేచిందిమొదలు..ఏ తొలిజాముదాకానో... నిద్రపట్టనీయక మనసును చెదల్లా వేధించే...జీవన పోరాటాల్లో అలిసి...సొలసి...సొమ్మసిల్లిన ఏ పాపం, మరే నేరం ఎరుగని...అమాయకుల ఉసుర్లను...ఉన్మాదులైన నరహంతకులు...అతి దారుణంగా ఊడ్చుకుపోతున్నా...మంచితనమనే సీసాలో బంధించబడ్డ మత రక్కసిని తమ స్వార్థాలకోసం రెచ్చగొట్టి మందిప్రాణాలు బలిగొంటున్నా...ప్రభుతకు ...ప్రజాప్రతినిధులకూ...బాధ్యతా, స్పందనా లేదని దుమ్మెత్తిపోస్తున్న మానవతా వాదమనే వేదాలు వల్లిస్తున్న ఓ గోముఖ వ్యాఘ్రాల్లారా! నా చుట్టూ చేరిన ఇంతమంది ఆడా మగా జనంలో...అనురాగాన్నిచ్చే అమ్మలే లేరా? అండను చూపగల నాన్నల్లేరా?

మా అమ్మ తెలిసో, తెలియకో...కుంతిలా!... వేయకూడని తప్పటడుగే వేసి ఈ 'మొలక'కు క్షేత్రమే అయినా...అనివార్య పరిస్థితులలో...అందరికీ అమ్మ అయిన ఈ అవనిపై వదిలేసిన ఆమె నిస్సహాయతను క్షమించి...నన్ను అక్కున చేర్చుకునే 'రాధ' అమ్మ మనసు...ఇంతమంఇ అమ్మల్లో ఏ ఒక్కరికీ లేదే? పోనీ! తెలిసే 'తప్పు' చేసిన మా అమ్మలోని 'మేనక' అసహాయతను మన్నించి ...నన్నాదరించే కణ్వమహర్షి దయాగుణం ఒక్కర్లోనూ లేదేం...ఇంతమంది నాన్నల్లో?

కేర్...కేర్...కేర్ర్!

అమ్మా! అందరూ...చెవులు, మనసూ తూట్లు పడేలా...నీ కసాయితనాన్ని దుమ్మెత్తి పోస్తున్నవారే తప్ప...ఒక్కరు...కనీసం...ఒక్క గుప్పిట కూడా... ఎంతోసేపుగా ఏడ్చి...ఏడ్చి...పొడారిన గొంతు గుక్కపట్టిన ఎక్కిళ్ళకు ...కనీసం గుక్కెడు నీళ్ళ...జాలి వింజామర వీచే మానవతా శాకుంతలం కాకపోవడమే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది.

అయ్యో! అమ్మా! ఈ కిరాతక...స్వార్థపూరిత మనుషుల మధ్య నేనెలా బ్రతకగలనని...నన్నిలా...వదిలేశావమ్మా? ప్రపంచంలోనే తొలి నిజం...తొలి దైవం అయిన నువ్వు...కేవలం 'నమ్మక'మైన నాన్న ఉనికికి నేను ముల్లునవుతానని భయపడ్డావా?

అద్దాల మేడలు, ఆస్తులు, ఆడంబరాలు, విలువైన నగలు,చీరలతో కూడిన అందమైన భవిష్యత్తును కాల్చేసే...నీ గతం కుంపటినవుతానని భీతి చెందావా?

అదే...అదే...నిజమైతే...నీ ఎదర బతుకంతా... చిందరవందర కాకూడదన్న ఆశ, ఆతృత...ఎంతగా ఉన్నా...తొమ్మిది నెలలు మోసిన సహనం...ఏ అనాధాశ్రమంలోనో...వదిలేసే ఓ గంట వెచ్చించే ఓ పరికరంలేని పిరికిదైపోయిందా?

అమ్మా! అమ్మమ్మ నెత్తీనోరూ బాదుకుని...నీకు నూరిపోసిన 'అరిటాకు...ముల్లు' సామెతను బేఖాతరు చేసిన నీ అహంభావపు ఆడతనపు యాష్ట్రేలోకి నుసిలా రాలిపడ్డ నా వంద వసంతాల బతుకు పుష్పాన్ని ...ఇంకా విచ్చుకోని...నెత్తుటి మొగ్గగానే... ఈ రాళ్ళల్లో...ముళ్ళల్లో...విదిల్చేసే అధికారం... అసలు నీకు ఎవరిచ్చారమ్మా?

> **'మా అమ్మను తిట్టకండి. మా అమ్మకేం తెలిసి ఉండదు. మా అమ్మ అమాయకత్వాన్నో, నిస్సహాయత్వాన్నో...ఆసరాచేసుకొన్న ఏ అవకాశమో...పామై నన్నీ స్థితికి దిగజార్చి ఉంటుంది'-అని ఎలుగెత్తి అరవాలని ఉంది. అరుస్తూనే ఉన్నా ఒక్కరూ విన్పించుకోరేం?**

'జాతస్య మరణం ధృవం!' కావచ్చు పుట్టుట గిట్టుట కొరకే అయినా...జననం నుండి మరణం దాకా... జీవిత పుస్తకంలోని జీవన రసాస్వాదన చేయించే బతుకు పుటల్లో...ఏ ఒక్కపేజీనీ చదవకుండానే చింపేసే హక్కు...జన్మనిచ్చినందుకు నీ జన్మహక్కనుకుంటున్నావామ్మా?

ప్రహరీ, కోట-గోడలు, కందకాల - పొత్తికడుపులో - పదినెలలూ పదిలంగా దాచుకొని - నేల మీదపడ్డ కొన్ని నిమిషాలకే... ఇలా దూరంగా...దారుణ హత్య చేయిస్తున్న కిరాతకం పదునుపెట్టిన ఏ ఆచారానికో.... మరే సాంప్రదాయానికో...తల వంచిన నీ అమానుషత్వాన్ని ఇక నేనేమని ప్రశ్నించగలను? ఎలా క్షమించగలను?

'నోరు, జ్ఞానంలేని పశుపక్ష్యాదులే...తమంత తాము ఆహారం సంపాదించుకొనేదాకా నానా పాట్లూ పడి...కడుపును నోట్లోకి తెచ్చుకొని...తమ సంతానాన్ని సాకుతాయే! మరి తనను మించిన విజ్ఞానఖని లేదని విర్రవీగే మనుష జాతిలో పుట్టిన నీకు...నా పెంపకం...తలకు మించిన భారమైనా సరే... భరించక తప్పని బాధ్యతన్న వివేకం కూడా లేకపోయినందుకు...నిజంగా నేను చాలా సిగ్గుపడుతున్నాను.

అమ్మా! మనుషుల్లో ఎంత దాచినా దాగని ఈ కుత్సితం, కర్కశత్వం, స్వార్థాలను జయించే మమత, మానవతలను మనుషుల మధ్య నెలకొల్పడమనే మహోన్నతమైన ఆశయం - నా జీవిత లక్ష్యంగా . సాధించాలని ఉన్నా...జీవించడానికి కనీసం జీవితమే లేని దురదృష్టవంతురాల్నయిపోతున్నాను కదమ్మా!

అమ్మా!అమ్మా! ప్లీజ్! నాకు బతకాలని ఉందమ్మా! జీవన మకరందామృతమే లభిస్తుందో...భరించలేని హాలహాలమనే కష్టాలే వరిస్తాయో...జీవిత పోరాట మథనం చేయాలని ఆశగా ఉందమ్మా! ఈ శతరేకుల బతుకు పద్మం పరిణామ దశలో విచ్చుకొనే ఒక్కో రేకు విరజిమ్మే జీవన సుగంధాలనాస్వాదించాలని ఎంతో కోరికగా ఉందమ్మా! కానీ, నాకా అవకాశం లేదని... క్షణక్షణానికి...నాకు చేరువవుతున్న మృత్యుదేవత... వికటాట్టహాసం...నీకూ విన్పిస్తోందామ్మా?!?

వినగల్గితే...ఆత్మీయత, త్యాగశీలత మూర్తీభవించిన అమ్మతనానికి నువ్విలా చిల్లు చేసే దానవు కాదు. పోనీలే, అమ్మా! పోతున్న ఈ ఆత్మ...మరో శరీరంలో ప్రాణం పోసుకుని జన్మనెత్తితే...తప్పక నీకు జన్మనిచ్చి...'అమ్మప్రేమ'ను నీకు రుచి చూపిస్తాను. 'అమ్మ'కు ఆదర్శరూపంగా ఆకృతి దాలుస్తాను.

'బీజమే లేకపోతే...ఎంతటి సుక్షేత్రమైనా...ఎలా పురుడు పోసుకొంటుందని' రొమ్ము బొరజాపి విర్రవీగే 'మగ'తనం...'నారు పోసిన వాడికే..నీరుకూడా పోసే బాధ్యత, దయ ఉండాల'న్న క్షమ, ప్రేమల ఉగ్గును నాన్నకు రంగరించే కన్నతల్లిగా...మళ్ళీ పుడతాను.

అవ్వాతాతల ముద్దు మురిపాలతో స్నానించి, అమ్మ కురిపించే సుధాక్షరధారలతో చిన్నిబొజ్జ నింపుకొని, అమ్మవెచ్చని ఒడి పొత్తిళ్ళలోనో, ప్రేమ ఉప్పొంగిన నాన్న గుండెలమీదో...కేరింతలలో ' ఈ పోలికలు పోల్చే అమ్మనాన్నల చిలిపి సరాగాల నడుమ, బంధుమిత్రుల కొంటె అచ్చట్లముచ్చట్ల మధ్య...చిద్విలాసంగా, నిశ్చింతగా...నిద్దర్లోకి జారుకోదల్చిన నేను...నాలోని మీ జాడలను సైతం పీల్చేస్తున్న...ఈ ఎర్రెర్రని ఎండలో వేగిపోతూ...ఎంతగా ఏడ్చినా రాని...నువ్వొస్తావన్న ఆశలా నా ప్రాణదీపం కొడిగట్టుకు పోతుంది.

మరి నాకు శెలవామ్మా! కడుపుచించుకొన్న కన్నతల్లే కాటిలో వదిలేయించిన పీడ తమ పీకలకెక్కడ చుట్టుకుంటుందోనని...మెలమెల్లగా జారుకొంటున్న ఈ అమానుష్య నీడలు...నిజమమ్మా! నన్నేం బాధించటం లేదిపుడు.

బిడ్డ 'కేర్' మనగానే పరుగులు తీసి 'కేర్' తీసుకొనే కన్నతల్లి అప్రమత్తతలేని ఏ బిడ్డ ఒంటరిగా...ఈ గడ్డ మీద మనుగడ సాగించలేదన్న నిజాన్ని గ్రహించే కాబోలు...తమ కడుపుల్లో 'చల్ల'గా దాచుకోవడానికి... ఆనందంగా...ఉప్పాయంగా...కేర్లెస్గా...కేర్ నాట్గా...నా చుట్టూ పోటీపడ్తున్న ...కుక్కలు...నక్కలు...రాబందులూ...మరి నేనిక ఉంటానమ్మా...వాటి బొజ్జల్లో ముక్కలు...చెక్కలుగా...! బై మమ్మీ!